# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 17.05.2025 | 24 క్యారెట్లు 86,215.00 | కిలో వెండి 1,05,087.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:196

www.vishalabharati.com




## పుష్కర స్నానం అదృష్టంగా భావిస్తున్నా

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాళేశ్వరంలో సరస్వతీ పుష్కర ఏర్పాట్లు అద్భుతంగా, అనిర్వచనీయంగా ఉన్నాయి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం కాళేశ్వరంలో కుటుంబ సమేతంగా డిప్యూటీ సీఎం పుష్కర పుణ్యస్నానం ఆచరించి, హారతి అనంతరం మీడియాతో మాట్లాడారు. పుష్కర స్నానంతో సకల సౌకర్యాలు, సౌభాగ్యాలు కలుగుతాయని ఏవైనా

..మిగతా 2 లో

# రక్షణకు బలమైన పద్దు

## డిఫెన్స్ బడ్జెట్ మరో రూ.50,000 కోట్లు పెంపు!

### ప్రతిపాదించిన పద్దు కంటే మరో రూ.50వేల కోట్లను పెంచే యోచనలో కేంద్రం

### దేశవార్షిక బడ్జెట్‌లో 13.45శాతం


### దేశీయ రక్షణ ఉత్పత్తులను పెంచే యోచనలో మోదీ సర్కార్



*ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత రక్షణ శాఖను మరింత బలోపేతం చేయడంపై కేంద్రం ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా 2025-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన పద్దు కంటే డిఫెన్స్ బడ్జెట్ ను మరో రూ.50వేల కోట్లను పెంచే యోచనలో కేంద్రం ఉంది. ఇందుకోసం పార్లమెంట్ శీతాకాల సమావేశంలో రూ.50వేల కోట్లకు సంబంధించిన సప్లిమెంటరీ పద్దును కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ బడ్జెట్లో సాంకేతిక పరిజ్ఞానం, మందుగుండు సామగ్రి కొనుగోలు, కొత్త ఆయుధాల ఖర్చులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ మేరకు ఆలోచన చేసినట్లు సమాచారం.*

విశాలభారతి, స్టేట్ బ్యూరో;

సాయుధ దళాల అవసరాలు, పరిశోధన అభివృద్ధి కోసం ఈ రూ.50వేల కోట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం, కేంద్ర బడ్జెట్‌లో రక్షణ కోసం రికార్డు స్థాయిలో రూ. 6.81 లక్షల కోట్లను ప్రతిపాదించారు. ఇది దేశవార్షిక బడ్జెట్‌లో 13.45శాతం. గత ఆర్థిక సంవత్సరం కంటే 9.53% ఎక్కువ. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, గత 10 సంవత్సరాలలో రక్షణ బడ్జెట్ దాదాపు మూడు రెట్లు పెరిగింది. అయితే 201415 బడ్జెట్లో రక్షణ రంగానికి రూ. 2.29 లక్షల కోట్లు కేటాయించారు. ఆపరేషన్ సిందూర్లో భాగంగా తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను సరిహద్దు దాటకుండానే భారత్ ధ్వంసం చేసింది. దీంతో పాకిస్థాన్పై భారత్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఉద్రిక్తతల సమయంలో భారతదేశ వాయుసేన స్వదేశీ సాంకేతికతతో పాక్ ప్రయోగించిన దాదాపు అన్ని క్షిపణులను, డ్రోన్లను గాల్లోనే ధ్వంసం చేసింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 12న కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్ సమయంలో మేడ్ ఇన్ ఇండియా ఆయుధాలను ప్రపంచం గుర్తించింది. మన దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆయుధాలపై విశ్వసనీయత పెరిగింది. 21వ శతాబ్దపు యుద్ధంలో మేడ్ ఇన్ ఇండియా రక్షణ పరికరాలకు టైమ్ వచ్చింది"అని ప్రధానమంత్రి మోదీ ఉద్ఘాటించారు. ఈ నేపథ్యంలో దేశీయ రక్షణ ఉత్పత్తులను పెంచడంతో పాటు మరిన్ని అభివృద్ధి చేసే అంశంపై కేంద్రం దృష్టి సారించింది. గత పదేళ్లలో రక్షణ ఎగుమతులు దాదాపు పది శాతం పెరిగాయి. ఉత్పత్తులు పెంచడం ద్వారా భవిష్యత్లో ఎగుమతులను పెంచుకునే యోచనలో మోదీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది.



# హైడ్రా మేధోమధనం

- మూసీ హద్దుల నిర్ధారణపై స్పెషల్ ఫోకస్
- నాలాల నెట్‌వర్క్‌పైనా నిపుణుల అభిప్రాయాల సేకరణ


విశాలభారతి, స్టేట్ బ్యూరో;

కాలుష్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడం.. ఇలా కారణాలేమైనా అసాధారణమైన వర్షాలకు నగరం అతలాకుతలం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాకాలం వరదముప్పు తప్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా మేధోమధనం చేసింది. "మూసీనది సరిహద్దు గుర్తింపు, ORR లోపల నాలా నెట్ వర్క్సతో పాటు వెడల్పుల నిర్ధారణ" అనే అంశంపై శుక్రవారం హైడ్రా సదస్సును నిర్వహించింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో

..మిగతా 2 లో

# నేర తీవ్రత ఎక్కువుంటే బెయిల్ కష్టం

- అలాంటి కేసుల్లో బెయిల్ మంజూరుకు కోర్టులు మొగ్గుచూపవు
- హైకోర్టు స్పష్టం
- అల్ప్రాజోలం కేసులో పదేళ్ల శిక్ష ఎదుర్కొంటున్న నిందితులకు బెయిల్ నిరాకరణ



విశాలభారతి,స్టేట్ బ్యూరో :

నేర తీవ్రత ఎక్కువగా ఉన్న కేసుల్లో సాధారణంగా కోర్టులు బెయిల్ మంజూరు చేయడానికి మొగ్గుచూపవని హైకోర్టు తేల్చి చెప్పింది. అంతేగాకుండా బెయిల్ పిటిషన్లపై విచారణలో సాక్ష్యాలు, ఆధారాల పూర్వాపరాల్లోకి వెళ్లలేమని, వీటిని అప్పీలుపై తుది విచారణ సందర్భంగానే కోర్టులు పరిశీలిస్తాయని స్పష్టం చేసింది. ఎన్డీపీఎస్ చట్ట పరిమితికి మించి నిషేధిత పదార్థం, అల్ప్రాజోలం కేసులో పదేళ్ల శిక్ష ఎదుర్కొంటున్న నిందితులకు బెయిలు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. నిషేధిత అల్ప్రాజోలం తయారీలో పదేళ్ల శిక్షను ఎదుర్కొంటున్న హైదరాబాద్‌కు చెందిన బండారు హనుమంతరెడ్డి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వాసంశెట్టి నరేష్‌లకు హైకోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. మెదక్ జిల్లా జిన్నారంలోని వెంకట రాఘవ

..మిగతా 2 లో



# పాక్ ఉగ్రవాదంపై దౌత్య యుద్ధం

- వచ్చే వారమే విదేశాలకు భారత అఖిలపక్ష బృందాలు
- దాదాపు 10 రోజుల పాటు పర్యటన
- పాక్ ఉగ్రభూతం గురించి అంతర్జాతీయ వేదికలపై గళం విప్పనున్న ఎంపీలు

..మిగతా 2 లో

# తడిసిన ధాన్యం కొంటాం

- 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- యాసంగి లోనూ రికార్డ్ స్థాయిలో దిగుబడి
- 130 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

యాసంగి సీజన్ లో ఇప్పటి వరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 60.14 లక్షల ఎకరాలు సాగు

..మిగతా 2 లో



# గ్రేటర్ లో స్మార్ట్ పోల్స్

- ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు
- విద్యుత్ శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అవుటర్ రింగ్ రోడ్ పొడవునా సోలార్ విద్యుత్
- వచ్చే మూడేళ్లలో పలు ప్రాజెక్టుల వల్ల విద్యుత్‌కు భారీ డిమాండ్
- ఈయేడు విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు

విశాలభారతి,స్టేట్ బ్యూరో;

ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఇక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదని ఆదేశించారు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయం, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ముందుగా ప్రయత్నించాలన్నారు. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ పొడవునా సోలార్ విద్యుత్ వినియోగించుకునేలా ప్రణాళిక చేయాలని, జీహెచ్ఎంసీ పరిధిలోని పుట్ పాత్లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్లో విద్యుత్శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అధికారులు పాల్గొన్నారు.వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ కు భారీ డిమాండ్



ఏర్పడుతుందని సీఎం అన్నారు. విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్పై దృష్టి సారించాలని ఆయన

..మిగతా 2 లో



# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు

**మునుగోడు, విశాలభారతి:**

మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం చిలుముల నరసింహ ముదిరాజ్ కుమారుడు మోహన్ ప్రత్యూష గార్ల వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను మునుగోడు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు మాజీ సర్పంచ్ మిరియాల వెంకన్న చండూర్ మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి చిలుముల సైదులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





# మైక్రో ఫైనాన్స్ మాఫియా మానవ హింస

- అప్పుల బరువు మోయలేక యువకుడి మృతి
- ముల్కనూరులో విషాదం
- కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్న ప్రజలు

**భీమదేవరపల్లి,విశాలభారతి:**

మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలు మరో నిరుపేద కుటుంబాన్ని అనాథలుగా మార్చాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడుగుల కిరణ్ (35) మైక్రో ఫైనాన్స్ సంస్థల అప్పుల భారం తాళలేక మనోవేదనతో మృతిచెందిన సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సుతారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కిరణ్ ఇటీవల ఐదు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి సుమారు మూడు లక్షల రూపాయల వరకు రుణాలు తీసుకున్నాడు. భార్య రుచితతో కలిసి కూలిపనులు చేస్తూ, అప్పులు చెల్లిస్తూ జీవనం నెట్టుకొస్తున్న పరిస్థితుల్లో ఇటీవల కిరణ్ పని సమయంలో గాయపడి పది కుట్లు వేసుకున్నాడు. ఆరోగ్య సమస్యల కారణంగా పని చేయలేకపోవడంతో అప్పులు చెల్లించలేని స్థితికి చేరాడు. ఆర్థిక ఒత్తిడితో మానసికంగా ఎంతో ఆందోళనకు గురైన కిరణ్, చివరిసారిగా తన భార్యతో "టెన్షన్ అవుతోంది" అంటూ ఫోన్ చేసిన మాటలే చివరిది అయింది. శుక్రవారం ఉదయం కిరణ్ శవంగా కనిపించడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ దుర్ఘటనతో అతని భార్య, చిన్నారులు ప్రజ్ఞ, నైనికల పరిస్థితిని చూసి పక్క వాళ్ళు కన్నీరు మున్నీరవుతున్నారు. కేవలం వడ్డీల పేరుతో గ్రామీణ ప్రాంతాల వారిపై భయంకరమైన ఒత్తిడి తెస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు మరోసారి ప్రాణం తీసిన ఘటన ఇది. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని గ్రామస్థులు, శ్రామిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# హైడ్రా మేధోమధనం

**తరువాయి భాగం**



ఎలాంటి సంబంధం హైడ్రాకు లేనప్పటికీ మూసీ ఆక్రమణలపై హైడ్రాకు అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో.. అస్సలు ఆ నది సరిహద్దుల నిర్ధారణ ఎలా చేపట్టాలనే విషయమై చర్చించింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను గుర్తించిన విధంగానే మూసీ నది ఎంఎఫ్ ఎల్( మాగ్జిమమ్ ఫ్లడ్ లెవెల్)ను గుర్తించేందుకు గ్రామ, రెవెన్యూ రికార్డులను దృష్టిలో పెట్టుకుని సరిహద్దులు నిర్ధారించాలని కొంతమంది సూచించారు. మూసీ పరివాహక ప్రాంతం హైడ్రాలజీ నివేధికలు, ఎన్ ఆర్ ఎస్ సీ శాటిలైట్ ఇమేజీలు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను కూడా పరిశీలించి.. మూసీ హద్దులను నిర్ధారించి నిర్మాణాలు జరగకుండా చూడాలని పలువురు హైడ్రాకు సూచించారు. నగరంలో 1908, 1954, 2000, 2008 సంవత్సరాలలో కురిసిన భారీ వర్షాలు.. అప్పటి పరిణామాలను చర్చించి మూసీ నదీ పరీవాహకంలో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నగరంలో నాలాలు కుంచించుకుపోకుండా చూడాలని పలువురు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 940 ప్రాంతాల్లో కల్వర్టులున్నాయని.. అక్కడ చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీరు సాధారణంగా వెళ్లడంలేదని పేర్కొన్నారు. పలు చోట్ల నాలాల లింకు కట్ అయ్యిందని.. దానిని పునరుద్ధరించాలన్నారు. కొన్ని చోట్ల కుంచించుకుపోయాయని.. అక్కడ నిర్మాణాలకు ఎలాంటి ముప్పు లేకుండానే కుదిరితే విస్తరణ లేదంటే మళ్లింపు చేయాలని పలువురు సూచించారు. నగర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినప్పుడు రహదారుల వెడల్పు విషయంలో ఎలాంటి ఆలోచన చేస్తున్నామో నాలాల నిర్మాణంలో కూడా అదే పాటించాలని పలువురు పేర్కొన్నారు. నాలాల తీరుతెన్నులపై సమగ్ర సర్వే చేసి సరైన ప్రణాళికలు సూచించాలని పలువురు పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వేఆఫ్ ఇండియా, ఇరిగేషన్, హైడ్రాలజీ, ఎస్ ఎన్‌డీపీ, ఎన్ ఆర్ ఎస్‌సీ, జీహెచ్ ఎంసీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పరేషన్‌తో పాటు.. అర్బన్ డెవలప్‌మెంట్ లో భాగస్వామ్యం అవుతున్న పలు సంస్థలకు చెందిన నిపుణులు ఇందులో పాల్గన్నారు.

# పుష్కర స్నానం అదృష్టంగా భావిస్తున్నా

**తరువాయి భాగం**

పొరపాట్లు, తప్పులు జరిగి ఉంటే పుష్కర స్నానంతో అవి పరిసమాప్తం అవుతాయి అన్నారు. కుటుంబంతో కలిసి సరస్వతి పుష్కర స్నానం ఆచరించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని డిప్యూటీ సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు.

12 రోజుల పాటు జరగనున్న పుష్కరాలకు ఏర్పాట్లు అద్భుతంగా చేశారు, వేలాదిగా జనం తరలి వస్తున్నారని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు గారి నాయకత్వంలో ఎక్కడ చిన్న లోపం లేకుండా భక్తులందరికీ సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారని అన్నారు. వేలాది మంది వచ్చినా అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన టెంట్ సిటీ అద్భుతంగా ఉందని కొనియాడారు. భద్రత, పారిశుద్ధ్యం, స్నానాల గాట్ల వద్ద ఏర్పాట్లను అధికారులు నిబద్ధత, నిష్టతో ఏర్పాటు చేశారని వివరించారు. పుష్కర స్నానాలకు ప్రతిరోజు ఒక పీఠాధిపతి వచ్చి స్నానం ఆచరించి ముక్తేశ్వర దర్శనం చేసుకుని పూజారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈ యొక్క గొప్ప సందర్భం అని అన్నారు. డిప్యూటీ సీఎం వెంట మంత్రి శ్రీధర్ బాబు జిల్లా యంత్రాంగం ఉన్నారు.

# నేర తీవ్రత ఎక్కువంటే బెయిల్ కష్టం

**తరువాయిభాగం**

ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 2016లో డీఆర్ఐ అధికారులు సోదాలు నిర్వహించి 132 కిలోల అల్ఫాజోలంతో పాటు తయారీ యంత్రాలు, పరికరాలు, ముడిపదార్థాలు, రసాయనాలు సీజ్ చేశారు. ఇందులో ముగ్గురు నిందితులకు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 లక్షల జరిమానా విధిస్తూ 2022లో కింది కోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హనుమంతరెడ్డి, వాసంశెట్టి నరేష్‌లు అప్పీలు దాఖలు చేశారు. ఇదే కేసులో వీరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా డీఆర్ఐ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టు బెయిల్పై హైకోర్టు తాజాగా విచారణ చేపట్టాలని, నిందితులు లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అప్పీలులో శిక్ష పడే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, విచారణలో జాప్యం జరుగుతున్న కారణంగా బెయిల్ మంజూరు చేయాలంటూ హనుమంత రెడ్డి, నరేష్‌లు ఈ ఏడాది ఏప్రిల్‌లో మరోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె లక్ష్మణ్ ఇటీవల విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు.

# ధాన్యం త్వరిగతిన మిల్లులకి తరలించాలి

- టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి
- మిల్లర్లు ధాన్యం దిగుమతి వెంటనే చేసుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

**సూర్యాపేట, విశాలభారతి:**



ధాన్యం త్వరిగతిన కాంటాలు వేసి మిల్లులకి తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు సూర్యాపేట మండలంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే రాయినిగూడెం 2,ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే బాలెంల 2,పి ఏ సి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎర్కారం,పిల్లలమర్రి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 90 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి అయిందని మిగిలిన ధాన్యాన్ని సాధ్యం అయినంత త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేస్తామని,లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకి పంపిస్తామని ,ఆకాల వర్షాలకి వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని మూడు రోజులలో కాంటాలు వేసి ధాన్యం మిల్లులకి తరలించాలని సూచించారు.ఇప్పటివరకు మెప్మా రాయినిగూడెం 2 కొనుగోలు కేంద్రం నుండి 6220 క్వింటాలు, ఐకేపీ బాలెంల 2 నుండి 17000 క్వింటాలు, పి ఏ సి ఎస్ పిల్లలమర్రి నుండి 13,333 క్వింటాలు, ఎర్కారం నుండి 17000 క్వింటాలు ధాన్యం మిల్లులకి తరలించటం జరిగిందని సంబంధిత నిర్వాహకులు అదనపు కలెక్టర్ కి వివరించారు.తిరుమలగిరి మండలంలోని ఎ ఎస్ ఆర్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీలను ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీనివాస్, సెంటర్ ఇంచార్జి లి ఫణీమా, పుష్పలత, వెంకటరెడ్డి, సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కుల, వర్గ జెమిలి పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న

- ఆశయ సాధనకై కృషి చేయాలి
- సిపిఐ( ఆర్ ఎం ) రాష్ట్ర కార్యదర్శి చామకూరి నరసయ్య

**సూర్యాపేట, విశాలభారతి:**

కుల,వర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న ఆశయ సాధన కోసం కృషి చేయాలని సిపిఐ( ఆర్ ఎం ) రాష్ట్ర కార్యదర్శి చామకూరి నరసయ్య అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులోని భీమ్ రెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద మారోజు వీరన్న స్మారక కమిటీ ఆధ్వర్యంలో బహుజన సిద్ధాంతకర్త మారోజు వీరన్న 26వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో వర్గ సమస్యలు పరిష్కారం కావాలంటే ముందుగా కుల నిర్మూలన జరగాలని అప్పుడే శ్రామిక రాజ్యం ఏర్పడుతుందని మారోజు వీరన్న అన్నారని గుర్తు చేశారు. ఈ దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీల కన్నా ముందే కుల సమస్యను మొట్టమొదట గుర్తించింది మారోజు వీరన్న అన్నారు. శ్రమజీవుల రాజ్య సాధనకై తన జీవితాంతం పోరాడడని తెలిపారు. దేశంలో కొనసాగుతున్న నిచ్చెన మెట్ల సామాజిక కుల సమస్యపై తిరుగుబాటు చేసి కుల నిర్మూలన జరగకుండా ఐక్యం కాదని వీరన్న చెప్పారని అన్నారు. వీరన్న ఆశయం నెరవేరాలంటే దళిత, బహుజనులు ఐక్యమై రాజ్యాధికార పోరాటంలో ముందుకు వచ్చి సామాజిక అసమానతలు లేని మానవ ప్రపంచాన్ని నిర్మాణం చేసినప్పుడే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రామచంద్రన్ వర్గం అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, ఎం సిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, నాయకులు వెంకన్న, రాములు, సోమయ్య, సైదమ్మ, ఎల్లయ్య పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యం కొంటాం

**తరువాయి భాగం**

చేయగా ధాన్యం దిగుబడి అంచనా 130 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు పురోగతి పై శుక్రవారం మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయం నుండి జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖా ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహన్, డైరెక్టర్ ప్రసాద్ లతో పాటు మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుందన్నారు. 202223 రబీ సీజన్ లో మే 15 నాటికి ధాన్యం కొనుగోలు 25.35 లక్షలు ఉండగా 202324 అదే రబీ సీజన్ లో అదే మే 15 నాటికి 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈ సంవత్సరం రబీ సీజన్ లో అదే మే 15 నాటికి ధాన్యం కొనుగోళ్లు 50 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందన్నారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ధాన్యం దిగుబడి ప్రతిబింబిస్తుందన్నారు. పెరిగిన ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 8,348 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గత రబీ సీజన్ తో పోల్చి చూస్తే ఈ రబీ సీజన్ లో అదనంగా 1,311 కొనుగోలు కేంద్రాలు కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో రానున్న 1012 రోజులు కీలకం అని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. ధాన్యం కొనుగోలును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ప్రభుత్వం నిర్దేశించుకున్న రీతిలో ఇప్పటికే 71 శాతం మేర కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ సునిశితమైనందున ఆయా జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు.

# పాక్ ఉగ్రవాదంపై దౌత్య యుద్ధం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన భారత్, ఇప్పుడు పాకిస్థాన్పై దౌత్య యుద్ధానికి సిద్ధమవుతోంది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి అంతర్జాతీయ వేదికలపై మాట్లాడేందుకు అఖిలపక్ష బృందాలను వివిధ దేశాలకు పంపనుంది. వచ్చే వారమే భారత అఖిలపక్ష బృందాల విదేశీ పర్యటనలు మొదలవుతాయి. దాదాపు 10 రోజుల పాటు ఈ పర్యటనలు కొనసాగుతాయని సమాచారం.

కేంద్ర ప్రభుత్వం సూచించే దేశాలలో అఖిలపక్ష బృందాలు పర్యటిస్తాయి. ఈ దౌత్యపరమైన కసరత్తులో భాగమయ్యేందుకు భారత్‌లోని విపక్ష పార్టీలు కూడా అంగీకారం తెలిపాయి. దీంతో ఆయా ప్రతిపక్ష పార్టీల సభ్యులకూ అఖిలపక్ష బృందాలలో చోటును కల్పించనున్నారు. అయితే ఎన్ని అఖిలపక్ష బృందాలను విదేశీ పర్యటనకు పంపుతారు? ఒక్కో అఖిలపక్ష బృందంలో ఎంత మంది సభ్యులు ఉంటారు? అనే దానిపై ప్రభుత్వ వర్గాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో బృందంలో 30 మందికిపై ఎంపీలు ఉంటారని పలువురు నేతలు చెబుతున్నారు. ఈ కసరత్తుపై త్వరలోనే భారత విదేశాంగ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

**మేం తప్పకుండా భాగమవుతాం: కాంగ్రెస్**

అఖిలపక్ష బృందాలను విదేశాలకు పంపే అంశంపై ఇప్పటికే తమ పార్టీతో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇంఛార్జి) జైరాం రమేశ్ వెల్లడించారు. "పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పుడు, ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ నిరాకరించారు. ఈ అంశాలపై చర్చ కోసం ప్రత్యేక పార్లమెంటు సెషన్‌ను నిర్వహించేందుకూ ప్రధానమంత్రి నో చెప్పారు. దేశం కోసం, దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని మేం చెబుతున్నాం. అయినా కాంగ్రెస్ పార్టీనే ప్రభుత్వం విమర్శిస్తోంది. ఇప్పుడు అకస్మాత్తుగా విదేశాలకు అఖిలపక్ష బృందాలను పంపుతామని అంటున్నారు. ఇది దేశ హితం కోసమే కాబట్టి, మేం కూడా తప్పకుండా ఆ బృందాలలో భాగమవుతాం" అని జైరాం రమేశ్ స్పష్టం చేశారు.

**ఈ నేతలకు ఛాన్స్**

బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎన్‌సీపీ (ఎస్‌పీ), జేడీయూ, బీజేడీ, సీపీఎం సహా పలు ప్రాంతీయ రాజకీయ పార్టీల ఎంపీలకు కూడా అఖిలపక్ష బృందాలలో చోటు దక్కనుంది. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, ఒడిశాకు చెందిన బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి, కాంగ్రెస్ ఎంపీలు శశిథరూర్, మనీశ్ తివారీ, సల్మాన్ ఖుర్షీద్, అమర్ సింగ్, టీఎంసీ ఎంపీ సుదీప్ బంద్యోపాధ్యాయ్, జేడీయూ నుంచి సంజయ్ ఝా, బీజేడీ నుంచి సస్మిత్ పాత్ర, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నుంచి సుప్రియా సూలే, డీఎంకే నుంచి కనిమొళి, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సహా పలువురు నేతలు ఈ బృందాలకు ఎంపికైనట్లు సమాచారం. మే 2223 నాటికి విదేశీ పర్యటనకు బయలుదేరేందుకు తాము సిద్ధమని ఓ పార్టీ నేత కేంద్ర విదేశాంగ శాఖకు తెలియజేసినట్లు అధికార వర్గాలు చెప్పాయి. ఈ అంశంపై అన్ని పార్టీలతో విదేశాంగ శాఖ అధికారులు టచ్‌లో ఉన్నట్లు తెలిసింది.

# గ్రేటర్ లో స్మార్ట్ పోల్స్

**తరువాయి భాగం**

సూచించారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై దృష్టి సారించాలని సీఎం చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలని సీఎం తెలిపారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని మెట్రో విస్తరణ, రైల్వే లైన్లు, ఇతర పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. భవిష్యత్లో డేటా సెంటర్ల హబ్గా హైదరాబాద్ మారబోతోందన్నారు. హైదరాబాద్లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. విద్యుత్ అవసరాలపై హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా సబ్ స్టేషన్లు అప్గ్రేడ్ చేయాలన్నారు. విద్యుత్లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు.

**విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు**

ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు అధికారులు సీఎం రేవంత్రెడ్డికి వివరించారు. గతేడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 202526లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 203435 వరకు డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని భవిష్యత్ అంచనాలను సీఎంకు చెప్పారు. రాష్ట్రంలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు సీఎం రేవంత్రెడ్డికి వివరించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం, 17.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
3
vishalabharathi Telugu Daily
GENERAL NEWS

# టీజీఎప్‌సెట్‌లో అదరగొట్టిన అరిగే కావేరి

- **13833 ర్యాంక్ సాధించిన సంగారెడ్డి విద్యార్థిని**

పటాన్ చెరు, విశాలభారతి:



ఇటీవల తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన టీజీ ఎప్ సెట్ లో సంగారెడ్డి పట్టణానికి చెందిన అరిగే కావేరి 13833 ర్యాంక్ సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. తాను ఇంటర్ ఫలితాల్లో బైపీసీ లో 1000 మార్కులకు గాను 986 మార్కులతో స్టేట్ మొదట ర్యాంక్, పదవ తరగతిలో 10/10 సాధించి సంగారెడ్డి పట్టణంలో ప్రభంజనం సృష్టించింది. సంగారెడ్డిలో చదివిన విద్యార్థి ని చదువులో టాపర్ గా నిలవడంతో తోటి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తనకు చదువు చెప్పిన గురువులకు అరిగే కావేరి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అరిగే సుధాకర్ కూతురు అరిగే కావేరి ఇంతటి ఘన విజయాన్ని సాధించినందుకు పోలీస్ శాఖ వారు హర్షం వ్యక్తం చేశారు.

## తాటి చెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడికి తీవ్రగాయాలు

నూతనకల్, విశాలభారతి:



యడవెల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బంటు వెంకన్న తాటి చెట్టుపై నుంచి జారిపడితీవ్రగాయాలు అయ్యాయి. శుక్రవారం రోజు మాదిరిగా తాటిచెట్లు ఎక్కడానికి వెళ్ళాడు. తాటిచెట్టు పైకి వెళ్ళాక చుట్టూ తిరిగి గొల గీస్తుండగా కాలిజారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన వెంకన్నను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం సూర్యాపేట కు తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సొసైటీ అధ్యక్షుడు బొడ్డు సైదులు కోరారు.

# వేసవి తీవ్రత దృశ్య విద్యుత్ సరఫరా అంతరాయం


పెద్ద అంబర్పేట్, విశాలభారతి:



అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి గౌరెల్లి, కుంట్లూర్ గ్రామాలతోపాటు లక్ష్మీ గణపతి ప్రాంతాలలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ జగన్మోహన్ తెలిపారు ఈ సందర్భంగా ఏ ఈ జగన్మోహన్ మాట్లాడుతూ నేడు శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కెవి గౌరెల్లి ఫీడర్ , 11 కెవి లక్ష్మీ గణపతి ఫీడర్, 11 కెవి కుంట్లూరు ఏజీయల్ ఫీడర్లలో వేసవి తీవ్రత దృశ్య విద్యుత్ సరఫరా అంతరాయం జరుగుతుండడం వలన నేడు విద్యుత్ను నిలిపివేయడం జరుగుతుందని ఏఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

# గంగమ్మను దర్శించుకున్న ప్రభుత్వ విప్

నరసింహుల పేట, విశాలభారతి:



మండల కేంద్రంలో శ్రీ గంగా మాత ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ రామ్ చంద్రునాయక్ గంగమ్మను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వారు మాట్లాడుతూ యాదవ కులస్తుల ఆధ్వర్యంలో ఆరాధ్య దైవం గంగాదేవి ఉత్సవాలు నిర్వహించడం ఐక్యతకు నిదర్శనం అని నాటి నుంచి నేటి వరకు యాదవ కులస్తులు క్రమం తప్పకుండా ధర్మాన్ని పాటిస్తూ సమాజంలో ఉన్న అన్ని కులాలకు వారు ఆదర్శంగా నిలుస్తున్నారని వారు కొనియాడారు. యాదవులంటేనే ధైర్య పరాక్రమలతో ముందుంటారని మోసం చేసే తత్వం యాదవులది కాదని నలుగురికి మేలు చేస్తూ నలుగురితో కలిసి మెలిసి ఉండే కులం యాదవ్ అని వారు కొనియాడారు. పాడిపంటలు పశువులు మంచిగా ఉండాలని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని వారు దర్శించుకున్నట్లు తెలిపారు. మండల కేంద్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిలో పథం వైపు ముందు ఉంచుతానాని గతంలో మాదిరిగా దత్తత తీసుకొని గాలికి వదిలేసే తత్వం నాది కాదనివారన్నారు. ఇప్పటికే కోటి రూపాయల నిధులతో అంతర్గత సిసి రోడ్లు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మండల కేంద్రంలోని పలు పవిత్ర దేవాలయానికి లైటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జనకుల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ యాదవ్, పెద్ద గొల్ల రేఖ ఐలయ్య, సారగొల్ల కోడి అవిలయ్య, గుడి పెద్దమనిషి ఎల్లావుల ఉపేందర్,చిర్ర సతీష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కాంగ్రెస్ నాయకులు తోట సురేష్, లింగారెడ్డి, ఎస్సీ ఎస్టీ ,బీసీ, మైనారిటీ అధ్యక్షులు, మహబూబ్ ఖాన్, దసరా నాయక్, యాకయ్య, అల్వాల శ్రీనివాస్, మహబూబ్ ఖాన్, గ్రామ పార్టీ అధ్యక్షులు కడుదుల రామకృష్ణ, చల్ల మధుకర్ రెడ్డి, సతీష్ యాదవ్, ఉపేందర్, అవిలయ్య, రమేష్, వీరన్న, ముఖేష్, ఉపేందర్, దోమల యాదగిరి, వెంకన్న, ఉపేందర్, ఉప్పలయ్య, మల్లయ్య ఉన్నారు.




# నేటి తిరంగా రాలిని విజయవంతం చేయాలి

సికింద్రాబాద్, విశాలభారతి:

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు జి భరత్ గౌడ్ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిలు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం 5గంటలకు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుండి వివేకానంద విగ్రహం వరకు తిరంగా ర్యాలీ సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీకి త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ వారికి సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది అలాగే యుద్ధంలో మరణించిన సోల్జర్లకు నివాళులు అర్పించడం జరుగుతుంది. పాకిస్తాన్ ఉగ్రవాదులకు తగిన రీతిలో బుద్ధి చెప్పి ప్రపంచ దేశాల మన్ననలను పొందిన మన ఆర్మీ సిబ్బందికి నడిపించిన మహా నాయకుడు నరేంద్ర మోడీ కి అభినందనలు తెలియజేస్తూ సికింద్రాబాద్ హైదరాబాద్ భారత పౌరులు అందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు జి భరత్ గౌడ్ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేవైఎం అధ్యక్షుడు శివాజీ, శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం చిలకలగూడ, సీతాఫల్మండి, ఉస్మానియా యూనివర్సిటీ, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలలో పర్యటించి చలో ట్యాంక్ బండ్ సెల్యూట్ ఫర్ ఆర్మీ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొనాలని వాకర్స్ కు, యువకులకు, క్రీడాకారులకు పలువురికి ప్రత్యక్షంగా కరపత్రాలు ఇచ్చి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా భారత్ గౌడ్ మేకల సారంగపాణి, శివాజీ మాట్లాడుతూ తిరంగా ర్యాలీ చలో ట్యాంక్ బండ్ కార్యక్రమాన్ని సంఘీభావంగా అన్ని వర్గాల ప్రజలు యువత మహిళలు పలు సంఘాలు కార్మికులు స్వచ్ఛంద సంస్థల వారు కాలనీ అసోసియేషన్స్ వారు అపార్ట్మెంట్లలో నివసించేవారు కళాకారులు దేశభక్తులందరూ పాల్గొని దేశ రక్షణలో మేము సైతం సిద్ధమని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ గిరి,అంబల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్,, బోండ0 ఉపేందర్ ,స్థానిక బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.




# డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత

- **దోమలు పుట్టకుండా చూద్దాం- కుట్టకుండా చేద్దాం**

గరిడేపల్లి, విశాలభారతి:

గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ వి నరేష్ మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు అన్నారు. దోమల ద్వారా డెంగ్యూ మలేరియా చికెన్ గునియా ఫైలేరియా వ్యాధులు వస్తాయన్నారు కావున దోమలు పుట్టకుండా కొట్టకుండా చూసుకోవాలన్నారు . డెంగ్యూ దోమలు పగటిపూట మాత్రమే కుడతాయన్నారు.ముఖ్యంగా ఇంటి పరిసరాలలో మురికినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి అన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే డ్రై డే (ప్రతి శుక్రవారం) పాటించాలన్నారు .ఇంటిలోని నీటి ఆవాసాలను వారానికి ఒకసారి క్లీన్ చేసి ఆరబెట్టాలన్నారు. ఈ విధంగా చేయడం వలన దోమలు పెట్టిన గుడ్లు, లార్వా లు అంతరించిపోతాయన్నారు.మరియు ఇంటి పరిసరాలలో వాడి పడేసిన పాత సీసాలు, కొబ్బరి బోండాలు పాత డ్రమ్ములు పాత టైర్లు,ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. మురికినీటి కాలువ ల లో చెత్తాచెదారం లేకుండా నీరు సాఫీగా పారే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు త్రిపురం అంజన్ రెడ్డి ఇతర ప్రజా ప్రతినిధులు ,సబ్ యూనిట్ ఆఫీసర్ ఏ రామకృష్ణ ,పి హెచ్ ఎన్ శారద ,సూపర్వైజర్s N.అంజయ్య గౌడ్ ,వెంకటరమణ శ్రీనివాస్ ఎంపీహెచ్ఏ,ఎల్టి ఉపేందర్ ,ఏ.ఎన్.ఎమ్స సరస్వతి,కవిత, అంజలి, విజయ ,సైదమ్మ బాలకృష్ణ, ఆశా కార్యకర్తలు ఉమా సైదమ్మ , అంజమ్మ,ఉపేంద్ర ,కోటేశ్వరమ్మ,తదితరులు పాల్గొన్నారు.



# బహుజన తెలంగాణ రాజ్యాధికారమే మారోజు వీరన్న ఆశయం

- **కొత్తగట్టు మల్లన్న**

తిరుమలగిరి, విశాలభారతి:

కుల వర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న 26 వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రోజు తిరుమలగిరి లోని పూలేఅంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన సామాజిక తెలంగాణ మహాసభ కన్వీనర్ కొత్తగట్టు మల్లన్న. ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడం తో పాటు తెలంగాణ రావాలని, కావాలని పోరుసల్పిన బహుజన కెరటం , వందలాది కుల సంఘాలకు దారి చూపిన దార్శనికుడు మారోజు వీరన్న అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో,మలి దశ ఉద్యమానికి ఆ రోజు మారోజు ఊపిరందించారు. అణగారిన కులాలు, జాతులు, తెగలను ఐక్యం చెయ్యడానికి దళిత బహుజన మహాసభ స్థాపించారు.ఐక్య రాజకీయ ఉద్యమాల నిర్వహణ కోసం మహాజన ఫ్రంట్‌ను రూపొందించిన మహానియుడు అని ఆయన పేర్కొన్నారు. మనుషులు ఈ భూమిపై పుట్టడం సులభమే కాని వీరన్నలా చావడం బహుషా అదృష్టమే అని ఆయన వ్యాఖ్యానించారు . ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ కందుకూరి సోమన్న , సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కడెం లింగన్న , బిఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా నాయకులు డాక్టర్ ప్రవీణ్ కందుకూరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వంగరి బ్రహ్మం , ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీను , విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు సామయ్య చారి , ఉపేంద్ర చారి , బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కందుకూరి రమేష్, విజయ్ నాయక్ , అనగందుల మల్లేష్ , సంఘపాక రవి , చిరంజీవి , కందుకూరి శ్రీను , అంబేద్కర్ , దాసు తదితరులు పాల్గొన్నారు.

# లేగ దూడల అక్రమ రవాణా.. బొలెరో వాహనం స్వాధీనం ముగ్గురు అరెస్ట్

- **జూన్ నెలలో బక్రీద్ – లాభాల కోసం చట్టాల ఉల్లంఘన**
- **సాక్షుల సమక్షంలో స్వాధీనం – పశుసంరక్షణ చట్టం కింద కేసు**

భీమదేవరపల్లి, విశాలభారతి:



బక్రీద్ పండుగను పురస్కరించుకొని అధిక ధరలకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్న మూడు లేగ దూడలను వంగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దిపేట హనుమకొండ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వంగర ట్రైనీ ఎస్సై హేమలత, కానిస్టేబుళ్లు రాజు, రమేష్ గస్తీ నిర్వహణలో భాగంగా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో బొలెరో వాహనంలో మూడు లేగ దూడలను అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కు చెందిన జాఫర్, ఇబ్రహీం, కనకం సదానందం అనే ముగ్గురు వ్యక్తులు ఈ అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. జూన్ 7న జరగనున్న బక్రీద్ పండుగలో వీటిని అధిక ధరకు అమ్మి లాభం పొందాలన్న ఉద్దేశంతో తరలించారని అనుమానం వ్యక్తం చేశారు. సాక్షులు భూక్య రవి, బడావత్ బాలు ల సమక్షంలో లేగ దూడలతోపాటు, బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పశుసంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దూడలను ధర్మసాగర్ గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# గంజాయి చాక్లెట్లు సరఫరా.. ఇద్దరు అరెస్ట్

- **గంజాయి చాక్లెట్ల కలకలం**
- **810 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాదీనం**
- **ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటన**

ఇబ్రహీంపట్నం, విశాలభారతి:


ప్రతీకాత్మక చిత్రం

గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్తాన్‌కు చెందిన షర్వాన్ కుమార్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిదిలోని కమ్మగూడలో పాన్‌షాప్ నిర్వహించేవాడు. తాను గత నాలుగు నెలలుగా రాజస్తాన్ నుండి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి వాటిని కూలీలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిషా రాష్ట్రానికి చెందిన అజిత్ సర్ధార్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి గంజాయి గంజాయి చాక్లెట్ల వ్యాపారం చేద్దామని నిర్ణయానికి వచ్చారు. షర్వాన్ కుమార్ రాజాస్తాన్ నుండి గంజాయి చాక్లెట్లు తీసుకువచ్చి మరో వ్యక్తి బినోద్ సర్దార్ కు ఇస్తే తాను చుట్టు పక్కల నివాసం ఉండే లేబర్‌కు అమ్మడానికి ఇద్దరు కలిసి ప్లాన్ చేశారు. తమ ఒప్పందం ప్రకారం బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో 5 డబ్బాలలో 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను షర్వాన్ కుమార్ రాజస్తాన్ నుండి తీసుకు వచ్చి నాదర్‌గుల్ ఇండస్ట్రీయల్ ఏరియా టాటా అడ్వాన్స్ సిస్టమ్ దగ్గర బినోద్ సర్ధార్‌కు ఇస్తుండగా ఆదిబట్ల పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 810 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు..



# ట్రయాంగిల్ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతాం

- **రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్**
- **పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

పటాన్ చెరు,విశాలభారతి:

రామచంద్రపురం డివిజన్ మయూరి నగర్ కాలనీలోని ట్రయాంగిల్ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు కార్పొరేటర్ బురుగడ్డ పుష్ప నగేష్ తెలిపారు. కాలనీ వాసుల కోరిక మేరకు జిహెచ్ఎంసి ద్వారా సుమారు 50.00 లక్షల రూపాయల నిధులు పార్కు అభివృద్ధికి మంజూరు చేయించినట్టు ఆమె చెప్పారు. శుక్రవారం ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డిఈ నరేందర్, ఏఈ దివ్య తేజ, స్థానిక కాలనీ అధ్యక్షులు మాధవ రెడ్డితో కలిసి కార్పొరేటర్ పుష్ప నాగేష్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ప్లే ఎక్విప్మెంట్స్, గేట్, ఎంట్రన్స్ అర్చ్, లైటింగ్, కాంపౌండ్ వాల్, గ్రీనరీ మరియు ఇతర పనులు చేయించి పార్కును అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్టు కార్పొరేటర్ పుష్ప నగేష్‌తెలిపారు. కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వీర్శెట్టి, దేవేందర్ యాదవ్, చక్రవర్తి, అంజయ్య, వెంకట్ రామ్ రెడ్డి, మాణిక్య రెడ్డి, రమేష్‌బాబు, సుయోధన్ రెడ్డి, శ్రీకాంత్, లింగం, భాస్కర్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



cinema updates





## కాజల్ కెరీర్ కూడా అంతే గ్రాండ్ గా ముగిస్తుందా?

బాలీవుడ్ లో `రామాయణం` ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. నితీష్ తివారీ దర్శక త్వంలో రూపొందుతున్న చిత్రంలో రాముడి పాత్రలో రణబీర్ కపూర్...సీత పాత్రలో సాయి పల్లవి నటి స్తున్నారు. రావణాసురుడి పాత్రలో పాన్ ఇండియా సంచలనం యశ్ నటిస్తున్నాడు. ఇప్పటికే ప్రధాన పాత్ర ధారులంతా షూటింగ్ లో భాగమయ్యారు. తాజాగా ఈప్రాజెక్ట్ లో కాజల్ అగర్వాల్ కూడా ఎంటర్ అయింది. కాజల్ సినిమాలో రావణుడి సతీమణి మండోదరి పాత్రకు ఎంపికైంది. టీమ్ ఇప్పటికే కాజల్ తో సంప్ర దింపులు జరిపి ఒప్పించినట్లు సమాచారం. గత వారమే కాజల్ పై లుక్ టెస్ట్ కూడా నిర్వహించారుట. మండోదరి పాత్రకు అమ్మడు పర్పెక్ట్ గా సూటవ్వడంతో ఎంపిక ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కాజల్ సెకెండ్ ఇన్నింగ్స్ ఎంతో గొప్పగా ముందుకెళ్తుంది. వివాహమైన తర్వాత ప్రతిష్టాత్మక చిత్రాలే చేస్తోంది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతో పాటు శక్తివంతమైన పాత్రలు కాజల్ ని వెతుక్కుంటూ మరీ వె ళ్తున్నాయి. విష్ణు హీరోగా నటిస్తోన్న `కన్నప్ప`లో కాజల్ పార్వతిదేవి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆ ఫోటోలు కూడా రిలీజ్ అయ్యాయి. వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. పార్వతిదేవికి నుదిటిన బొట్టు పెట్టని స్టిల్ పై అభ్యంతరాలు వ్యక్తమైనా తర్వాత వాటిని సరిచేసుకున్నారు. సినిమాలన్నింటికంటే ముందే కెరీర్ ఆరంభంలో మగధీరలు యువరాణి పాత్రతో ఎంతో మందికి కలకల హీరోయిన్ గానూ మారింది. అప్పటి నుంచి ఇండస్ట్రీకి ఎంతో మంది హీరోయిన్లు వచ్చారు. కానీ ఎవరికీ ప్రిన్సెస్ పాత్ర పోషించే అవకాశం రాలేదు. కాజల్ పోషించిన పాత్ర టాలీవుడ్ చరిత్రలోనే నిలి చిపోయింది. పరిశ్రమకు వచ్చిన ప్రతీ హీరోయిన్ కు కాజల్ లాంటి పాత్ర పోషించాలని కోరుకున్న వారే. అలా కెరీర్ ఆరంభంలోనే ట్రెండ్ సెట్టర్ భామగా నిలిచింది. సెకెండ్ ఇన్నింగ్స్ కూడా అంతే అద్భుతంగా కొనసాగిస్తుంది. చూస్తుంటే కాజల్ కెరీర్ కూడా అంతే గ్రాండ్ గాముగించే లా ఉంది. గొప్ప పాత్రలన్ని కాజల్ ని మాత్రమే వెతక్కుంటూ రావడం అన్నది ఆమెకే చెల్లింది.

## కీర్తి సురేష్ కోసం ఎదురుచూపులు..!

మహానటి కీర్తి సురేష్ మొన్నటిదాకా సౌత్ లోనే సినిమాలు చేయగా జస్ట్ పెళ్లికి ముందే బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. అక్కడ బేబీ జాన్ అనే సినిమాతో అమ్మడు చేసిన ప్రయత్నం తెలిసిందే. అదేంటో తెలుగు, తమిళ్ లో పదుల సంఖ్యలో సినిమాలు చేసిన కీర్తి సురేష్ తనలోని హా**ట్ యాంగిల్ ని చూపించింది లేదు. కానీ అమ్మడు మాత్రం హిందీలో చేసిన తొలి సినిమాకే ఒక రేంజ్ లో రెచ్చిపోయింది. దీనికి ప్రత్యేకంగా కారణం అంటూ ఏది లేదు. సౌత్ భాలౌ ఎవరైనా బాలీవుడ్ వెళ్లగానే ముందు గ్లామర్ తోనే అక్కడ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయాలని ప్రయత్నిస్తారు. కీర్తి సురేష్ కూడా అదే దారిలో వెళ్లాలని చూస్తుంది. బేబీ జాన్ రిజల్ట్ ఆమెను సాటిస్ఫై చేయలేదు. ఐతే కీర్తి సురేష్ సౌత్ ఫ్యాన్స్ మాత్రం అమ్మడిలోని ఈ డిఫరెంట్ యాంగిల్ ని ఎంజాయ్ చేస్తున్నారు. ఇదిలాఉంటే లాస్ట్ ఇయర్ డిసెంబర్ లో కీర్తి సురేష్ తన బాయ్ ఫ్రెండ్ ఆంటోనిని పెళ్లాడింది. 15 ఏళ్లుగా సీక్రెట్ లవ్ స్టోరీని నడిపించిన కీర్తి సురేష్ ఫైనల్ గా పెళ్లితోనే తన సోల్ మేట్ ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. పెళ్లి కాగానే బేబీ జాన్ ప్రమోషన్స్ లో పాల్గొన్న అమ్మడు ఆ తర్వాత ఇక హాలీడేస్ తీసుకుంది. భర్తతో ఎంచక్కా ప్రపంచ యాత్రలో ఉన్న కీర్తి సురేష్ నెక్స్ట కమిట్ మెంట్స్ ఉన్నా కూడా తీరిక చేసుకునే టైం కనిపించట్లేదు. పెళ్లైన ఏ హీరోయిన్ అయినా కూడా ఏడాది పాటు అలా విహరిస్తూ లైఫ్ ని ఎంజాయ్ చేస్తుంటారు. కీర్తి కూడా ప్రస్తుతం అలాంటి మూడ్ లోనే ఉంది. ఐతే ఆమె కమిటైన సినిమా మేకర్స్ ఆమె ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో ఎల్లమ్మ సినిమాకు సైన్ చేసిందని తెలుస్తుంది. ఈ సినిమాకు ఆమె బ్లక్ డేట్స్ కావాలని అడిగారట. ఐతే కీర్తి మాత్రం ఎప్పుడు షూటింగ్ కి వస్తానన్నది క్లారిటీ ఇవ్వట్లేదట. ఆమె కోసం చిత్ర యూనిట్ అంతా ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారని తెలుస్తుంది. ఐతే కీర్తి కూడా హాలీడేస్ టైం లో సినిమాల గురించి ఆలోచన వదిలేసి భర్తతో ప్రతి మూమెంట్ ని ఎంజాయ్ చేస్తుంది. అందుకే విహార యాత్రలు ముగించుకుని వచ్చిన తర్వాతే సినిమ యూనిట్ తో టచ్ లో ఉండాలని అనుకుందట. ఐతే త్వరలోనే ఎల్లమ్మ ఫస్ట్ షెడ్యూల్ మొదలు పెడుతున్నారని తెలుస్తుంది. నితిన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాను బలగం వేణు డైరెక్ట్ చేస్తున్నాడు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు భారీ బడ్జెట్ కేటాయిస్తున్నట్టు తెలుస్తుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.